క్లుప్తంగా

త్వరితగతిన సచివాలయ భవన నిర్మాణాలు



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నెల్లూరు(పొగతోట): గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. నగరంలోని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో డీఈలు, ఏఈలతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 544 గ్రామ సచివాలయాలు, 541 ఆర్బీకేలు, 455 విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలను చేపట్టామని చెప్పారు. గ్రామ సచివాలయాలు 270 నిర్మాణాలు పూర్తికాగా, 71 భవనాల నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని పేర్కొన్నారు. 201 ఆర్బీకే భవన నిర్మాణాలను పూర్తి చేయగా, 73 భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని వెల్లడించారు. 108 విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలు పూర్తికాగా, 74 భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని చెప్పారు. నిర్మాణాలకు సంబంధించి 25 శాతం బిల్లులను చెల్లించామని, పూర్తయిన వాటికి పది రోజుల్లో చెల్లించనున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీసీ రోడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చూడాలని పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

నెల్లూరు(క్రైమ్): స్పెషల్ పార్టీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మరింత పేరు తీసుకురావాలని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో స్పెషల్ పార్టీ సిబ్బందితో దర్బార్‌ను శుక్రవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఆర్‌ఐలు అంకమరావు, పాల్‌రాజు, మౌలుద్దీన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సంపదను అందించిన పవిత్ర గ్రంథం భగవద్గీత



ప్రవచిస్తున్న గంగాధరశాస్త్రి

నెల్లూరు(బృందావనం): విలువైన జ్ఞాన సంపదను ప్రపంచానికి పంచిపెట్టిన పవిత్ర గ్రంథం భగవద్గీత అని ప్రముఖ ప్రవచనకర్త గంగాధరశాస్త్రి పేర్కొన్నారు. వేదాయపాళెం కూడలి వద్ద శ్రీనివాస కల్యాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని భగవద్గీతపై శుక్రవారం ఆయన ఉపన్యసించారు. జీవన చరమాంకంలో పఠించే గ్రంథం కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

- స్కూటీని ఢీకొన్న కారు
- వైద్య విద్యార్థిని మృతి. మరొకరికి తీవ్ర గాయాలు



నెల్లూరు(క్రైమ్): మితిమీరిన వేగంతో వస్తున్న కారు రోడ్డు దాటుతున్న స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న వైద్య విద్యార్థిని మృతిచెందగా, మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన యామిని (29), కృష్ణా జిల్లాకు చెందిన శ్రావణి నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో పీజీ (గైనకాలజీ) సెకండియర్ చదువుతూ కళాశాల హాస్టల్లో ఉంటున్నారు. తమ సహచర విద్యార్థినులు హుస్సేన్‌బీ, వినీలాతో కలిసి యామిని, శ్రావణి రెండు వాహనాల్లో కళాశాల హాస్టల్ నుంచి జాతీయ రహదారిపై గల ప్రెస్టో హోటల్‌కు బయల్దేరారు. ముందు వెళ్తున్న వైద్య విద్యార్థినులు సాక్షి కార్యాలయ సమీపంలో రోడ్డు క్రాస్‌చేయగా.. యామిని, శ్రావణి రోడ్డు దాటే క్రమంలో చెన్నై వైపు నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సహచర విద్యార్థినులు స్థానికులతో కలిసి 108 సాయంతో వీరిని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. యామినిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. శ్రావణి తీవ్రగాయాలతో అక్కడే చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. హాస్పిటల్‌కు చేరుకొని సహచర విద్యార్థినులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. సమాచారం అందుకున్న విద్యార్థులు మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకొని యామిని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించిన ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యథేచ్ఛగా కబ్జా



శ్రామికనగర్ వద్ద కుచించుకుపోయిన వరద కాలువ

- కుచించుకుపోతున్న కాలువలు, వరద వాగు
- సజావుగా సాగని వరదనీరు
- వర్షాకాలంలో తరచూ అవస్థ
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



కుమ్మరగుంట వద్ద కనుపూరు కాలువకు ఇరువైపులా ఆక్రమణలు

నెల్లూరు రూరల్: కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. కాలువలు, వాగులను సైతం యథేచ్ఛగా ఆక్రమించి పలు సమస్యలకు కారణమవుతున్నారు. అధికారులు సైతం సక్రమంగా స్పందించకపోవడంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది.

వర్షాకాలంలో దారుణం

నగర శివారు ప్రాంతాల్లోని వరద కాలువలు, వాగులు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా కాలువల్లో వరదనీరు సజావుగా సాగే పరిస్థితి కానరావడంలేదు. చిన్నపాటి వర్షానికే నీరు లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లోని గృహాలు నీటమునిగే పరిస్థితి నెలకొంటోంది. కొత్తూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో గల వరద కాలువలు, శ్రామికనగర్ వద్ద ఉన్న వాగు ఆక్రమణకు గురైంది.

పట్టించుకునేవారేరీ..?

కొత్తూరు ప్రాంతం గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు ఆక్రమణలను అడ్డుకునేవారు. కార్పొరేషన్లో విలీనమైన అనంతరం నగరపాలక సంస్థ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు ఆక్రమణల విషయంలో నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తున్నారు. ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి. ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా, పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు కాలువలు, వాగుల్లో ఉన్న ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇదీ తీరు..

- వెంకటాచలం మండలం కనుపూరు నుంచి అంబాపురం చెరువులోకి చేరుకునే కనుపూరు కాలువకు ఇరువైపులా వండ్లూరు కాలనీ, కుమ్మరగుంట కాలనీ, రవిచంద్ర గిరిజన కాలనీ, శ్రామికనగర్, రామకోటయ్యనగర్, అంబాపురం ప్రాంతాల్లో ఆక్రమణలు వెలిశాయి. ఇందులో పక్కా నిర్మాణాలను చేపడుతున్నారు. నివాస గృహాలు, దుకాణాలను నిర్మించి కాలువ విస్తీర్ణాన్ని పూర్తిగా తగ్గిస్తున్నారు. ఫలితంగా కాలువల్లో పూడికతీసే సమయంలో ఇక్కట్లు తలెత్తుతున్నాయి.
- రూరల్ మండలంలోని దొంతాలి నుంచి కొత్తూరు, శ్రామికనగర్, చంద్రబాబునగర్, రెవెన్యూ కాలనీ, పోలీస్ కాలనీ, తెలుగుగంగ కాలనీ, శివాజీనగర్, టైలర్స్ కాలనీ మీదుగా ఉడుముల వాగు నెల్లూరు చెరువులోకి చేరుతుంది. ఈ వాగుకు ఇరువైపులా ఆక్రమణలు ఏర్పడ్డాయి. వాగును సైతం పూడ్చేసి పక్కా నిర్మాణాలు చేపట్టారు.
- శ్రామికనగర్ వంతెన వద్ద వాగులో వరదనీరు సజావుగా సాగేందుకు వీల్లేకుండా ఆక్రమణలు వెలశాయి. దీంతో వరద నీరు పక్కదారి పట్టి సమీపంలోని తిరుమలనగర్, శ్రామికనగర్‌లోని లోతట్టు ప్రాంతాలకు చేరుతోంది. భారీ వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఈ ప్రాంతాలు జలమయమవుతున్నాయి.
- కుమ్మరగుంట కాలనీ ప్రధాన రహదారి నుంచి శ్రామికగర్, చంద్రబాబునగర్, ఎన్టీఓ లేఅవుట్ మీదుగా సాగే వరద కాలువకు ఇరువైపుల ఆక్రమణలు ఏర్పడ్డాయి. కాలువ నానాటికీ కుచించుకుపోతోంది.
- శ్రామికనగర్‌లోని చిన్నపాటి వరద కాలువలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. నీరు సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంటోంది.



శ్రామికనగర్ వద్ద వాగులో ఆక్రమణలు

లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం

"ఆక్రమణల తొలగింపు విషయమై రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాం. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులను చూపితే తగు చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగిస్తాం.

– శ్రీకాంత్, ఇరిగేషన్ ఏఈ

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(సెంట్రల్): ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పలు అంశాలపై ఎంపీతో మాట్లాడారు.

పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు(సెంట్రల్): రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో పారిశుధ్య పనులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మదన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. డివిజన్లో పారిశుధ్య సమస్యల్లేకుండా అన్ని చర్యలను చేపట్టనున్నామని తెలిపారు.

నియామక ఉత్తర్వుల అందజేత



నెల్లూరు(సెంట్రల్): కారుణ్య నియామకం ద్వారా కౌశిక్ అనే వ్యక్తికి జూనియర్ సహాయకుడిగా ఉద్యోగాన్ని కల్పిస్తూ నియామక పత్రాన్ని రిజిస్ట్రార్ బాలాంజనేయులు శుక్రవారం అందజేశారు. నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ సహాయకుడిగా నియమించామని తెలిపారు.

రంగడికి బంగారు గరుడసేవ



నెల్లూరు(బృందావనం): గరుడ పంచమిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి బంగారు గరుడసేవను శుక్రవారం నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో తిరుమంజనం, పూజలు చేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

రంగనాథుడి సేవలో కలెక్టర్ దంపతులు

తల్పగిరి రంగనాథస్వామిని కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు, కుటుంబసభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో వారికి ఆహ్వానం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేయాలి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గానూ పార్టీ నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా 21, 22, 23వ డివిజన్ల నేతలు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశాన్ని పడారుపల్లిలోని ఏఎన్నార్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించాలని.. పథకాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మేరిగ మురళీధర్ ఏకగ్రీవం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

బెదిరింపులకు కాలం చెల్లు

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీ నేతలు, కార్యకర్తలను బెదిరింపులకు గురిచేశారని, వీటికి ఇక కాలం చెల్లిందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం అందరూ ఎంతో స్వేచ్ఛగా ఉన్నారని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు గౌరి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాజీ కార్పొరేటర్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరుడు కొలువైన పుణ్యస్థలి చిదంబరం



ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(బృందావనం): సృష్టి, స్థితి, లయకారుడు శంకరుడని.. పరమేశ్వరుడు కొలువైన పుణ్యస్థలి చిదంబరమని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. భరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో పురమందిర ప్రాంగణంలో సతారా (ఉత్తర చిదంబర) క్షేత్ర వైభవంపై శుక్రవారం ఆయన ప్రవచించారు. కంచికామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి స్వీయ పర్యవేక్షణలో నిర్మితమైన దివ్యక్షేత్రం సతారా చిదంబర ఆలయమని తెలిపారు. సత్యదండాన్ని చేతపట్టి దేశమంతా పాదచారిగా పర్యటించి సన్యాశ్రమ ధర్మం, కాషాయధారణతో ధర్మానుష్ఠం చేసిన మహాపురుషులు చంద్రశేఖరేంద్ర సరస్వతి అని అభివర్ణించారు. చిదంబర ఆలయం ఎంతో పవిత్రమైన శైవక్షేత్రమని.. ఆలయ నాలుగు గోపురాలను దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రభుత్వాలు నిర్మించాయన్నారు.

నెల్లూరంటే ఎంతో ఇష్టం

తనకు నెల్లూరంటే ఎంతో ఇష్టమని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కాకినాడ, హైదరాబాద్, తదితర ప్రాంతాలకంటే నెల్లూరంటే ఎంతో మక్కువన్నారు. ఏ ప్రాంతంలో చెప్పని రీతిలో ప్రవచనలను నెల్లూరులో దైవానుగ్రహంతో నిర్వహించడం ఎంతో ఆనందమని చెప్పారు. అనంతరం ఆయన్ను భరద్వాజ రుద్రాభిషేకం సంఘ సభ్యులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, హరిప్రసాద్, అజయ్‌కుమార్, తదితరులు సత్కరించారు.

ముగిసిన క్రీడా పోటీలు



హాకీ విజేత నెల్లూరు జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న శ్రీనివాస్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్ ఉద్యోగులకు నిర్వహిస్తున్న ఇంటర్ సర్కిల్ వాలీబాల్, హాకీ, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ఏపీ ట్రాన్స్‌కో జిల్లా సర్కిల్ ఎస్‌ఈ శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెంట్రల్ స్పోర్ట్స్ కౌన్సిల్ విజయవాడ, స్పోర్ట్స్ కౌన్సిల్ ఏపీ ట్రాన్స్‌కో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఏపీ ట్రాన్స్‌కో నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణ, చిన్నప్పశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్, ఏఏఓ శివప్రసాద్, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార్ వడివేలు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- హాకీ పోటీల్లో ఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు విజేతగా నిలిచింది. తిరుపతి, ఆర్టీపీపీ జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- వాలీబాల్ పోటీల్లో వీటీపీఎస్, విశాఖపట్నం, రాజమహేంద్రవరం జట్లు మొదటి మూడు స్థానాలను సాధించాయి.
- అథ్లెటిక్స్ విభాగంలో విజయనగరం, కృష్ణపట్నం థర్మల్ విద్యుత్ స్టేషన్, ఆర్టీపీపీ జట్లు విజేతలుగా నిలిచాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని టౌన్ – 2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబజార్, కిసాన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని బోడిగాడితోట, సత్యనారాయణపురం, లక్ష్మీపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, ప్రశాంతినగర్, శ్రీనివాసనగర్, వీవర్స్‌కాలనీ, జీనిగలవీధి, సరస్వతీనగర్, ఏసీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

- శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో డీఎస్‌నగర్, ఇండస్ట్రియల్, పెన్నార్, సీజీ రోడ్డు ఫీడర్లలో గల మూడో మైలు, పత్తివారి సత్రం, డీఎస్‌నగర్, అప్పయ్యవారితోట, మైపాడు గేట్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఏఈ మన్మథరావు పేర్కొన్నారు.

27న న్యాయవాదుల విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది సురేంద్ర దారుణ హత్యకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను ఈ నెల 27న బహిష్కరించనున్నారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి అలుపెరగని కృషి చేస్తోందని జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని ఏపీ ఆర్ఎస్ఏ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో ఏపీ జేఏసీ అమరావతి కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇటీవల హఠాన్మరణం పొందిన ఏపీ జేఏసీ అమరావతి మాజీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ వైవీ రావుకు శ్రద్ధాంజలి ఘటించారు. సంఘ జిల్లా సెక్రటరీ జనరల్ చెంచురామయ్య, ఆర్ అండ్ బీ శాఖ అధ్యక్షుడు శరత్‌బాబు, పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ తరఫున బాబూరావు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): టీచర్, గ్రాడ్యుయేట్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సన్నద్ధమైంది. అవాంఛనీయ ఘటనలు, అల్లర్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్పీ విజయారావు చర్యలు చేపట్టారు. మద్యం, నగదు ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. కోడ్ వచ్చిన నాటి నుంచి మద్యం అక్రమ రవాణాపై 20 కేసులు నమోదు చేసి రూ.1,25,055 విలువ జేసే 88.37 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై రెండు కేసులు నమోదు చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో 24 గంటలూ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. 458 లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని, నియమావళి ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర చరిత్రలో ఒకేసారి ఇద్దరు వడ్డెర్లకు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వడ్డెర సంక్షేమ సంఘ అధ్యక్షుడు మహేష్ కొనియాడారు. వడ్డెర్లకు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నగరంలోని సంఘ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏసురత్నం, జయమంగళ వెంకటరమణకు అవకాశాన్ని కల్పించారని చెప్పారు. వడ్డెర మహిళా సంఘ అధ్యక్షురాలు నిర్మల, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలు



పనులను పరిశీలిస్తున్న హరిత

నెల్లూరు సిటీ: సఫాయిమిత్ర సురక్ష చాలెంజ్ అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు సేవలను అందిస్తున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో అధునాతన యంత్రాలతో చేపట్టిన డ్రైనేజీ క్లీనింగ్‌ను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు గ్లౌజ్‌లు, హెల్మెట్, షూస్, మాస్కులను వినియోగించాలని కోరారు. భూగర్భ డ్రైనేజీ పనుల్లో భాగంగా మ్యాన్‌హోళ్ల శుభ్రత కోసం యంత్రాలను మాత్రమే వినియోగించాలన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు అన్ని రక్షణ నిబంధనలను పాటిస్తూ, స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఉత్తమ ర్యాంకును సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, ఏఈ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపీలు ప్రాథమిక వైద్యాన్నే అందించాలి



డీఎంహెచ్‌ఓను సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్యసేవలను మాత్రమే అందించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని పలు పీఎంపీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం పీఎంపీ జిల్లా కార్యాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని.. చివరన ఎలాంటి డిగ్రీలు రాసుకోకూడదని సూచించారు. అధిక మోతాదులో యాంటిబయోటిక్స్‌ను రోగులకు ఇవ్వకూడదని పేర్కొన్నారు. రోగుల తీవ్రతను గుర్తించి సమస్య ఎక్కువగా ఉంటే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని చెప్పారు. అనంతరం డీఎంహెచ్‌ఓను సత్కరించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, సంఘ నెల్లూరు డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దవనోత్సవం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో దవనోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తగా మల్లికార్జున్‌రెడ్డి వ్యవహరించారు. కాగా శనివారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

గాయనికి పురస్కారం

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన గాయకురాలు భారతి తెలుగు భాషా సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఎస్సార్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో తనకు జ్ఞాపిక, ప్రశంసపత్రాన్ని అందజేశారని ఆమె చెప్పారు. తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి తనను సత్కరించారని పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): అప్పు తీసుకొని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కును ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో బారకాస్‌కు చెందిన సునీల్‌కుమార్‌రెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.50 లక్షల చెక్కు మొత్తాన్ని రెండు నెలల్లో ఫిర్యాదికి చెల్లించాలని నెల్లూరు స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి లావణ్య శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు.. కనుపర్తిపాడుకు చెందిన విజయమ్మ వద్ద సునీల్‌కుమార్‌రెడ్డి 2015, ఏప్రిల్ 15న రూ.కోటిని అప్పుగా తీసుకొని రూ.50 లక్షల చొప్పున రెండు ప్రామిసరీ నోట్లను రాసిచ్చారు. దీంతో పాటు ఆయనకు చెందిన ఆస్తులనూ తనఖా పెట్టారు. ఈ నేపథ్యంలో ఐఎన్జీ వైశ్యా బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్ పేరిట రూ.50 లక్షల చెక్కును 2018, జనవరి 24న సునీల్‌కుమార్ ఇచ్చారు. అదే ఏడాది మార్చి ఐదున ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, నెల్లూరు బ్రాంచ్‌లోని తన ఖాతాలో ఆమె జమ చేయగా అకౌంట్ బ్లాకై ఉందనే సమాచారం వచ్చింది. దీంతో ఆమె న్యాయవాది ద్వారా అదే ఏడాది మార్చి 29న లీగల్ నోటీస్‌ను పంపి కోర్టులో కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.